

# నవీనుడు

ఇసుకపల్లి సుజాత

చంద్రరేఖకు కథలంటే ప్రాణం. అందులో నవీన్ కథలంటే మరీను. మొన్నామధ్య నవీన్ హైద్రాబాద్ వచ్చినప్పుడు ఊళ్లోనే కదా అని కలవడానికి వెళ్ళింది కూడా. పేరు వినడమే గాని ఎప్పుడూ చూడలేదు కాబట్టి గుర్తుపట్టడం కొంచెం కష్టమే అయింది కాని అక్కడ జన మధ్యంలో నుంచున్నది నవీనేనని గుర్తుపట్టి చొరవగా అతన్ని సమీపించి 'చంద్రరేఖ అనే అమ్మాయి మీ కథల గురించి తరచు ఉత్తరాలు వ్రాస్తూంటుంది చూడండి. ఆ అమ్మాయిని నేనే' అని తనను తాను, పరిచయం చేసుకుంది. జనాన్ని తోసుకుని హడావిడిగా ముందుకు వస్తున్న ఆమెను చూశాడేగాని నవీన్ కూడా పేరు విన్నాకే

ఆమెను గుర్తు పట్టాడు. వెంటనే, చేతులు రెండు జోడించి 'నమస్తే చాలా సంతోషం' అని ముక్తసరిగానే అన్నాడు కాని ఆమె తనను వాళ్ళింటికి ఆహ్వానిస్తే బాగుణ్ణు అని అనిపించకపోలేదు నవీన్‌కి. అతని మనసులోని మాట పసిగట్టిందో ఏమో చంద్రరేఖ ఆదేమాట పైకి అనేసింది. మొదట కొంత మొహమాట పడినా విజిటింగ్‌కార్డ్ ఇచ్చాక మర్నాడే ఆమె ఇంటికి రావడానికి ఒప్పుకున్నాడు.

సాయంత్రం అయిదు కావస్తోంది. ఒకపక్క వాకిట్లో లిల్లీ, గులాబీపూల కుండీలను సద్దుతూనే మరొక పక్క మాలిని శుభ్రంగా ఊడవమని పురమాయిస్తూ తెగ హడావిడి పడుతోంది చంద్రరేఖ. మొదట వాళ్ళ నాన్నగారు అతని రాకకు కొంత అభ్యంతరం చెప్పినా పిలవటం అయ్యాక ఇప్పుడు ఏమనీ ఏంలాభం అని కొంత చిరాకుపడ్డారు కూతురి మీద.

సరిగ్గా అయిదు గంటలు కొట్టంగానే వాకిట్లో స్కూటర్ ఆగిన చప్పుడయింది. వెంటనే కర్టెన్ తీసి చూసి మనిషే వస్తుంటే కథ చదవటమెందుకని పుస్తకం లోపల పెట్టేసి పరుగులాంటి నడకతో బైటకు వచ్చేసింది. నవీన్ లోపలికి రాగానే సోఫామీద కూర్చోమని చెప్పి 'ఈయనే సుప్రసిద్ధ కథా రచయిత నవీన్‌గారు. వారు మా నాన్నగారు. బిజినెస్ చేస్తుంటారు' అని చంద్రరేఖ నవీన్‌ను వాళ్ళ నాన్నగారికి పరిచయంచేసింది. పరస్పర నమస్కారాలయ్యాక 'ఈ అమ్మాయి చాలా మాడ్‌గానే ఉంది, తనే స్వయంగా నన్ను వాళ్ళ నాన్నగారికి పరిచయం చేసింది' అని మనసులోనే అనుకున్నాడు నవీన్.

చంద్రరేఖ వాళ్ళ నాన్నగారు కూడా 'ఏమో అనుకున్నాను అన్న పైమనికి సరిగ్గానే వచ్చాడు బుద్ధిమంతుడు లాగానే ఉన్నాడు చూస్తే' అని మనస్సులోనే అభిప్రాయపడ్డారు. టిఫిన్ తీసుకు వచ్చిన చంద్రరేఖను చూడగానే వారిద్దరి మూగ సంభాషణ ముగిసింది. టిఫిన్ చెయ్యడం పూర్తయ్యాక ఆమె అతని కథల గురించి ప్రశ్నల వర్షం కురిపించటం మొదలుపెట్టింది. నవీన్‌కు ఇది కొంత ఇబ్బంది అనిపించినా ఏదో కప్పదాటుస మాధానాలు చెప్తూ వచ్చాడు. ఆమె నాన్నగారు కుటుంబ విషయాల గురించి ఏవో అడుగుతుంటే అన్నిటికీ శ్రద్ధగా నవ్వుతూ జవాబిచ్చి ఇంక వెళ్ళొస్తానని చెప్పి తన విజిటింగ్ కార్డు వాళ్ళకిచ్చి వాళ్ళందర్నీ తమ ఊరుకి రమ్మని ఆహ్వానించి మరీ వెళ్ళాడు నవీన్.

ఎప్పటికైనా ఒక గొప్ప రచయితను పెళ్ళాడాలని కలలు గన్న చంద్రరేఖకు ఆ రచయితే యీ నవీనేమో అని అనిపించింది.

కాలేజీకి వెళ్ళాక తన ఫ్రెండ్స్‌తో నవీన్‌ను గురించి ఏకరువు పెట్టేసింది. వాళ్ళంతా కూడా 'అతని గొప్పతనం మాకు తెలుసులేవే బాబు, నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా ఏమిటి' అని ఎగతాళి చేశారు, ఆమె మనస్సును పసిగట్టి.

నవీన్ వచ్చి వెళ్ళినప్పటినుండే చంద్రరేఖకు తొందరగా పెళ్ళిచేసేస్తే బాగుండుననుకున్నారు వాళ్ళ నాన్నగారు. అదే మాట భార్యతోను చెప్పి సంప్రదింపులు జరిపి తాను వస్తున్నట్లుగా నవీన్‌కు ఉత్తరం వ్రాశారు.

తాను వరించబోయేది ఒక గొప్ప రచయితని అని తలచుకున్న చంద్రరేఖ సంతోషానికి అవధిలేకుండా పోయింది.

స్టేషన్‌కు వచ్చి అయనను సగౌరవంగా ఇంటికి తీసుకువెళ్ళి తల్లిదండ్రులకు పరిచయం చేశాడు నవీన్. మర్యాదలయ్యాక కాస్సేపు ఎండలు, రాజకీయాలు వగైరాల గురించి మాట్లాడిన తరువాత వచ్చిన విషయం బైటపెట్టారు చంద్రరేఖ వాళ్ళ నాన్నగారు. విషయం విన్న నవీన్ తల్లిదండ్రులు లోపలికెళ్ళి కొంత సేపు చర్చించుకున్న తరువాత అంగీకరించారు. చంద్రరేఖ అభిప్రాయాలెరిగిన నవీన్ కాస్త తటపటయించినా 'ఏమవుతుందిలే, దీనివలన పెద్ద ఏమిటి నష్టం?' అని ధైర్యంచేసి అమెను వివాహం చేసుకోవడానికి ఒప్పుకున్నాడు.

వచ్చిన పని సానుకూలమయిందని తెలుసుకుని అయన తమ ఊరు తిరిగి వెళ్ళి ఈ శుభవార్త ఇంట్లో చెప్పడమేమిటి, అతి వైభవంగా చంద్రరేఖా నవీన్‌ల వివాహం జరగడమేమిటి అంతా ఒక వారంరోజుల్లో చకచకా జరిగిపోయింది.

కొన్నాళ్ళ వరకు, తనసలు కథ లే వ్రాయట్లేదేమిటి అని లోలోపలే బాధపడి ఓపికతో ఎదురుచూస్తూ వచ్చింది చంద్రరేఖ. ఇంక లాభం లేదనుకుని లోపలి మాట అతనితోనే పైకి అనేసింది. 'ఈ మధ్య మీరు కథలే వ్రాయట్లేదు. ఎందుకని? ప్లీజ్ నాకోసమైనా వ్రాయరా. అసలు పెళ్ళయ్యాక ఒక్క కథ కూడా వ్రాయలేదు ఇలాగని తెలిస్తే నేను చేసుకోకపోదును' అని గబుక్కున అనేసింది తొందరపాటులో. నవీన్‌కు ఒళ్ళుమండి 'అవునులే నీ ప్రేమంతా నా కథలమీదే కదూ' అని తటాలున అనేసి చివుక్కున లేచి వెళ్ళిపోయ్యాడు. చంద్రరేఖ మనస్సు చివుక్కుమంది ఎందుకన్నానా ఆ మాట అని.

కొన్నాళ్ళ తరువాత పత్రికల్లో ఉగాది కథల పోటీల గురించి చదివిన చంద్రరేఖ మళ్ళీ మొదలుపెట్టింది నవీన్‌ను కథలు వ్రాయమని అడగటం. 'నేను మిమ్మల్ని వ్రాయమనేది బహుమతి కోసం కాదు. అయినా వ్రాసినవాళ్ళందరికీ బహుమతి రావాలనుందా ఏమిటి?




అందుకుకాదు నే ననేది. ఇప్పుడు వ్రాస్తే కనీసం ఇంతకు ముందున్న పేరైనా నిలుస్తుందని నా ఆశ. వ్రాయలేనివాళ్ళు ఎలాగూ ఆ పని చేయలేరు. వ్రాసేవాళ్ళు కూడా ఇలా మానేస్తే ఎలా?' అని ఎంతో ప్రాధేయపడింది చంద్రరేఖ. కాని తన పేరుతో కథలు వ్రాసిపెట్టే స్నేహితుడు వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయ్యాడని చంద్రరేఖకు చెప్పడమెలాగ అని మధనపడిపోతూ నవీన్ నిస్సహాయంగా చూశాడు ఆమెవైపు తనను మన్నించమని.